క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ భవానీపురం ఫీడర్ లైన్ల మరమ్మతు కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని ఎంఐజీ–1 బ్లాకులు, స్వాతి థియేటర్ రోడ్, మానవ మందిరం రోడ్, అమృత అపార్ట్‌మెంట్ రోడ్, పోపూరివారి వీధి, హనుమయ్య వీధి, గుడివాడ రామారావు వీధి, ప్రసాద్ హోటల్ రోడ్, లత హాస్పటల్ రోడ్, ఎంపీ దాస్ వీధి, ఆకుల రాజేశ్వరరావు మిల్ రోడ్, చెట్ల బజార్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

మంచినీటి రిజర్వాయర్‌కు నేడు శంకుస్థాపన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 46వ డివిజన్ కొండ ప్రాంతంలోని యానాదుల బజార్‌లో నూతన మంచినీటి రిజర్వాయర్ నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన జరుగుతుందని వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు వెన్నం రజనీకుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం 9.15 గంటలకు కేటీ రోడ్డులో భీమన వారి వీధి వద్ద రిజర్వాయర్ పనులకు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో పాటు పలువురు కార్పొరేటర్లు, అధికారులు హాజరవుతారని చెప్పారు.

అధికారులకు మెమోలు జారీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి నివేదనశాలలోకి సాధారణ భక్తుడిని అనుమతించడంపై దుర్గగుడి ఈవో భ్రమరాంబ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై నివేదన శాల ఏఈవో, సూపరింటెండెంట్, ఇతర అధికారులను వివరణ అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి నివేదనశాలలో జరిగిన ఘటనపై అర్చకులను ఆరా తీశారు. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించడంతో పాటు తదుపరి విచారణ నిమిత్తం ఫుటేజీని తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని వైదిక కమిటీని ఆదేశించడంతో పాటు సంబంధిత అధికారులు, పర్యవేక్షకులు గురువారం నాటికి వివరణ ఇవ్వాలని మెమోలు జారీ చేశారు. ఈ ఘటన నేపథ్యంలో నివేదనశాలను సంప్రోక్షణ చేసినట్లు సమాచారం.

దాసాంజనేయ ఆలయ హుండీ ఆదాయం రూ.12.11 లక్షలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవాలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు రూ.12 లక్షల 11 వేల 729 నగదు, 75 యూఎస్ డాలర్ల ఆదాయం లభించింది. మాచవరం దాసాంజనేయస్వామి వారి దేవాలయంలో బుధవారం దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ, కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షణలో హుండీ కానుకల లెక్కింపు జరిగింది. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సభ్యులు సంప్రదాయ దుస్తుల్లో లెక్కింపులో పాల్గొన్నారు. 112 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని ఇన్‌స్పెక్టర్ అనురాధ తెలిపారు. హుండీ లెక్కింపులో ధర్మకర్తలు బండి నాగజ్యోతి, కోలా సురాంబ, యక్కల మారుతి, ప్రత్యేక ఆహ్వానితులు పోలుకొండ శ్రీనివాసరావు, భక్తులు సేవ సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఖోఖో సంఘ సమావేశం వాయిదా

విజయవాడ స్పోర్ట్స్: ఈ నెల 30వ తేదీన జరగాల్సిన ఉమ్మడి కృష్ణా జిల్లా ఖోఖో అసోసియేషన్ సంఘ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు కృష్ణాజిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గన్నవరంలోని రోటరీ హాల్‌లో ఈ సమావేశం నిర్వహిస్తామని ఇటీవల ప్రకటించారు. కొన్ని అనివార్య కారణాలతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రసాద్ వెల్లడించారు.

980 మంది చిరు వ్యాపారులకు సాయం

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు పథకం కింద 6వ దఫా 980 మంది చిరు వ్యాపారులకు ఆర్థిక సాయం అందజేసిందని వెలుగు ఏపీఎం పి.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని లబ్ధిదారులకందరికీ వారి బ్యాంకు ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున సోమవారమే జమ అయ్యాయన్నారు. గత ఆరు దఫాలుగా మండలంలో చిరు వ్యాపారాలు చేసుకొంటూ జీవనం సాగించే వారికి ప్రభుత్వం వడ్డీలేని రుణ సదుపాయం కల్పించిందన్నారు.

110 మందికి కంటి పరీక్షలు

కంకిపాడు: మండల కేంద్రమైన కంకిపాడులో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ 60 ఏళ్లు నిండిన 110 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

జగనన్న పాలనలో అద్భుత సంస్కరణలు



సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు,



జగనన్న సురక్ష క్యాంప్‌నకు హాజరైన మహిళలు

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- 51, 52 డివిజన్లలో సర్టిఫికెట్ల అందజేత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అద్భుత సంస్కరణలను అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని 51, 52 డివిజన్లలో లబ్ధిదారులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వెలంపల్లి శ్రీనివాసరావు మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలనా సంస్కరణలను తీసుకొచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో ఎన్నడూ ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థ ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేసిందన్నారు. ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా వలంటీర్లు వెంటనే స్పందించి ప్రజలకు అండగా ఉంటున్నారని వివరించారు. అంతేకాకుండా ప్రభుత్వ పథకాలకు సంబంధించి వలంటరీ వ్యవస్థ, సచివాలయాలు గొప్ప పాత్రను నిర్వహిస్తున్నాయన్నారు. ఏపీ రాష్ట్రంలో ఉన్న సచివాలయ వ్యవస్థ నిర్వహిస్తున్న పాత్రను యావత్ దేశం ఆదర్శంగా తీసుకుంటుందన్నారు. నియోజకవర్గ కొండ ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

11 రకాల ధ్రువీకరణ పత్రాల పంపిణీ

మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దేశంలో ఏపీ పరిపాలన సంస్కరణలను ఆదర్శంగా తీసుకొని అనేక రాష్ట్రాలు ముందుకు సాగుతున్నాయన్నారు. తొలుత వివిధ అంశాలకు సంబంధించి 11 రకాల ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు అతిథుల చేతుల మీదుగా వారి సర్టిఫికెట్లను అధికారులు అందజేశారు. కార్యక్రమంలో 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, ఏసీజీ శ్యామలాదేవి, 52వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి తంగెళ్ల రామచంద్రరావు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సేవలు మరింత చేరువ

- రాష్ట్ర హోం శాఖ తానేటి వనిత
- లబ్ధిదారులకు సర్టిఫికెట్ల అందజేత



జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్ అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

పాయకాపురం(విజయవాడరూరల్): జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వర్యులు, రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని 63వ డివిజన్ 273, 276 సచివాలయాల పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డెప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజ, బెల్లం దుర్గతో కలిసి ఆమె పాల్గొన్నారు.

క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి..

అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు నూరు శాతం పరిష్కారమయ్యే దిశగా జగనన్న సురక్ష క్యాంప్‌లను ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తోందన్నారు. జగనన్న సురక్ష క్యాంప్ లక్ష్యాలను ప్రజలకు వివరించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గంపై స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక దృష్టి సారిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు రాబడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో నిత్యం జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలే ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. ఏ రాష్ట్రంలోని ప్రతి ఇంటిని సంక్షేమ పథకాలతో సీఎం జగనన్న ఆదుకుంటుంటే, నియోజకవర్గ ప్రజల అవసరాలను ఎమ్మెల్యే విష్ణు తీరుస్తున్నారని మంత్రి వనిత అన్నారు. అటువంటి నాయకుడిని మరోసారి తిరుగులేని మెజార్టీతో గెలిపించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

2,169 సర్టిఫికెట్ల అందజేత

అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ప్రజా వినతులను సత్వరం పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం వంటి ప్రత్యేక కార్యక్రమాలను ప్రభుత్వం నిరంతరం అమలు చేస్తోందన్నారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అప్పటికప్పుడే 11 రకాల సేవలు పూర్తి ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. 63వ డివిజన్‌లో 969 మందికి కుల, 927 మందికి ఆదాయ, 31 మందికి బియ్యం కార్డులు, ముగ్గురికి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లతో పాటు వివిధ రకాల సేవల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 2,169 సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశామన్నారు. జగనన్న సురక్ష ద్వారా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి మేలు చేకూరుతోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీవోయూసీడీ శకుంతల, నార్త్ ఎమ్మార్వో మాధురి, అసిస్టెంట్ కమిషనర్ –2 అనసూయ, స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

● కాల్వల ప్రక్షాళనకు వీఎంసీ ట్రయల్ రన్





నగరంలోని ఏలూరు, బందరు, రైవస్ కాల్వల్లోని వ్యర్థాలను తొలగించేందుకు వీఎంసీ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. దీనిలో భాగంగా కాలువల్లో ఎప్పటికప్పుడు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించేందుకు పడవలను సిద్ధం చేసింది. మున్సిపల్ కార్మికుల సాయంతో వీఎంసీ అధికారులు బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ పడవలను త్వరలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ అందజేస్తున్న ఫాదర్ అనిల్

గుణదల(విజయవాడతూర్పు): పేద విద్యార్థులను ప్రోత్సహించే దిశగా తమ కళాశాల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఆంధ్రలయోల కళాశాల ఎగ్జామ్ కంట్రోలర్ ఫాదర్ అనిల్ అన్నారు. కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. సామాజిక, ఆర్థిక పరిస్థితులను అధిగమించి విజయ పథంలో సాగాలన్నారు. పేద విద్యార్థులను ప్రోత్సహించే దిశగా కళాశాల భౌతికశాస్త్ర విభాగం పలు ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దీనిలో భాగంగా 80 మంది పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ ఉచితంగా అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకులు టి.శ్రీకుమార్, ఎంసీ రావు, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేస్తున్న సిద్ధార్థ అకాడమీ ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థులు పట్టుదలతో పాటుగా ప్రణాళిక ప్రకారం చదివితే ఏ పోటీ పరీక్షల్లోనైనా విజయాలు సొంతం చేసుకోవచ్చని సిద్ధార్థ అకాడమీ కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు చెప్పారు. సిద్ధార్థ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు సిద్ధార్థ అకాడమీ ఆధ్వర్యంలో జేఈఈ మెయిన్స్ స్టడీ మెటీరియల్‌ను బుధవారం కళాశాల ఆవరణలో ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపేందుకు ఈ స్టడీ మెటీరియల్ ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. సిద్ధార్థ అకాడమీ అకడమిక్ సలహాదారుడు ఎల్‌కె.మోహనరావు, సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ టీమ్ పరిశీలన

పి.నైనవరం(విజయవాడరూరల్): పి.నైనవరం గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై స్వచ్ఛ సర్వేక్షణ్ టీమ్ బుధవారం పరిశీలించారు. గ్రామంలో పబ్లిక్ ప్రాంతాల్లో, స్కూల్స్, దేవాయాల వద్ద పరిశుభ్రతను తనిఖీ చేశారు. వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగం, కామన్ లెట్రిన్స్ వినియోగం శుభ్రతలను గమనించారు. గ్రామంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్ టీమ్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యదర్శి చెన్న కేశవరావు వారికి వివరాలు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: పెనమలూరు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలవటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పల్లిపేటకు చెందిన మోకా రాజ్‌కుమార్ బోరు పనులు చేస్తాడు. అతను మంగళవారం పనికి వెళ్లలేదు. రాత్రి పెనమలూరు సెంటర్‌లో మద్యం దుకాణానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలవటంతో అతనిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఏసీపీ హనుమంతరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సచివాలయాల్లోని మహిళా పోలీసులు సమాజంలో మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజయవాడ వెస్ట్ ఏసీపీ కె.హనుమంతరావు ఆదేశించారు. వెస్ట్ డివిజన్ పరిధిలోని వన్‌టౌన్, కొత్తపేట, భవానీపురం, ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ల పరిధిల్లోని వివిధ సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీసులతో రాయల్ కన్వెన్షన్‌లో బుధవారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. ఆయా సచివాలయాల పరిధిల్లో పని చేస్తున్న మహిళా పోలీసులు మహిళా సమస్యలను గుర్తించాలన్నారు. వాటిని తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతేకాకుండా మహిళల వివాదాలకు సంబంధించి మహిళా పోలీసుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను, అందులో మహిళా పోలీసులను ఏర్పాటు చేసిందన్నారు.

మహిళా సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన మహిళా పోలీసులు ప్రభుత్వం లక్ష్యాలను నెరవేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు సురేష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణపై చైర్మన్ అసహనం



మరుగుదొడ్లను పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణపై దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు అసహనం వ్యక్తం చేశారు. కనకదుర్గానగర్‌లో దేవస్థానం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను చైర్మన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరుగుదొడ్లు దుర్వాసన రావడంతో పాటు క్లీనింగ్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వెంటనే దేవస్థాన శానిటేషన్ విభాగం ఇన్‌చార్జితో ఫోన్‌లో మాట్లాడారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ క్రమంలో కొంత మంది భక్తులు అక్కడ నెలకున్న ఇబ్బందులు, సమస్యలను వివరించారు. త్వరలోనే టాయిలెట్స్‌ను పూర్తిగా మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని చైర్మన్ రాంబాబు భక్తులతో పేర్కొన్నారు.

ప్రణాళికతో విద్యనభ్యసిస్తే విజయం తథ్యం



సదస్సులో ప్రసంగిస్తున్న నాగేశ్వరరావు, వేదికపై తేజోవతి, జగదీష్, శ్రీధర్ తదితరులు

విజయవాడ కల్చరల్: విద్యార్థులు ప్రణాళిక, సంకల్పం, పట్టుదలతో కృషి చేస్తే విజయం తథ్యమని యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ మేనేజర్ ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. యువజన సర్వీసుల శాఖ ఎన్టీఆర్, కృష్ణా జిల్లా శాఖల ఆధ్వర్యంలో బీఆర్టీఎస్ రోడ్డులోని శారదా కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అంశంగా అవగాహనా సదస్సును బుధవారం నిర్వహించారు. సదస్సును ప్రారంభించిన నాగేశ్వరరావు మాట్లాడుతూ లక్ష్య సాధనే ధ్యేయంగా చిత్తశుద్ధి, ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలన్నారు. అధ్యాపకులను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు తేజోవతి, జగదీష్‌లు మాట్లాడుతూ.. ధ్రుడమైన మనస్సు, మంచి స్నేహితులు, మంచి ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. అవగాహన సదస్సులో కళాశాల కరస్పాండెంట్ ఎస్ వరప్రసాద్, ఇంటర్మీడియెట్ విభాగం ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పట్టెల రోజేష్‌బాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరశర్మ పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన పలు సమస్యలకు నిపుణులు పరిష్కారాలు చెప్పారు.

అదృశ్యమైన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ ఉషారాణి

పెనమలూరు: కానూరులో అదృశ్యమైన బాలుడిని పోలీసులు వెంటనే ఆచూకీ తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. కానూరుకు చెందిన ఎం.నాని వ్యవసాయ కూలీ. అతనికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు థామస్(7) కానూరు ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. మంగళవారం నాని తన కుమారుడు థామస్‌ను పాఠశాలలో దించి పనులకు వెళ్లాడు. అయితే సాయంత్రం నాని భార్య కుమారుడి కోసం పాఠశాలకు వెళ్లగా అక్కడ థామస్ కనిపించలేదు. గ్రామంలో విస్తృతంగా గాలించినా చిన్నారి ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు బాలుడి ఫొటో వాట్సాప్ గ్రూప్‌లో పెట్టి గాలింపు చేపట్టారు. అయితే బాలుడు సైకిల్ తొక్కుకుంటూ మంగళవారం రాత్రి పోరంకి శివారు ప్రాంతం సాలిపేట పొలాల వద్ద కనపడడంతో స్థానికులు అతనిని తమ వద్దే జాగ్రత్తగా ఉంచి, బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి సీఐ కిషోర్‌బాబు తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు.

ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటనారాయణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆర్టీఏ నిబంధనలు, ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ వాహనాలను నడపాలని ఎస్ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ ఆటోడ్రైవర్లను ఆదేశించారు. నగర పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఉత్తర్వుల ప్రకారం డీసీపీ విశాల్‌గున్ని, ఏసీపీ సీహెచ్ రవికాంత్‌ల ఆదేశాల మేరకు ఎస్ఎన్‌పురం పోలీసులు గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆటో డ్రైవర్లకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంటక నారాయణ ఆటో డ్రైవర్లు డ్యూటీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలను వివరించారు. ముఖ్యంగా డ్రైవర్లు ఆటో నడిపేటప్పుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆటో రికార్డులు కలిగి ఉండాలన్నారు. ప్రయాణికులతో మర్యాదగా నడచుకోవాలని, ఎవరైనా ప్రయాణికులు తమ లగేజీలను ఆటోలో మర్చిపోతే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించినప్పుడు వారి సమాచారం పోలీసులకు అందించాలని చెప్పారు.

కొరియర్ సంస్థల నిర్వాహకులతో..

ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో అనుమానిత పార్సిళ్లపై నగరంలోని కొరియర్ సంస్థల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వస్తున్న పార్సిల్స్‌పై కొరియర్ సంస్థల నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పార్సిల్ బుక్ చేసేటప్పుడు, తీసుకునే సమయంలో ఆ వ్యక్తుల పూర్తి వివరాలు నమోదు చేయడం ముఖ్యమన్నారు. ఏదైనా అనుమానిత పార్సిళ్లను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఎస్ఐలు షరీఫ్, దుర్గాభవాని, సిబ్బంది పాల్గొన్నారు.

కారును ఢీకొన్న టిప్పరు

కంకిపాడు: కారును వెనుక నుంచి టిప్పరు ఢీకొన్న ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. అదనపు ఎస్ఐ జె.లక్ష్మి కథనం మేరకు... హైదరాబాద్ ఎస్ఎస్ఆర్ కాలనీకి చెందిన నడకుదిటి విజయ రామరాజు కారులో పామర్రు నుంచి విజయవాడ వైపు వస్తూ దావులూరు టోల్‌ప్లాజా వద్దకు రాగానే వెనుక నుంచి టిప్పరు వేగంగా వచ్చి కారును ఢీకొట్టడంతో కారు ధ్వంసమైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్ఐ లక్ష్మి తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

కంకిపాడు: ఆపన్నులకు అండగా నిలవాలని మారేడుమాక సర్పంచ్ సీహెచ్ ఆదర్శకుమార్ అన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా మారేడుమాక కేంద్రంగా నిర్వహిస్తున్న మదర్‌థెరిస్సా వెలుగు వృద్ధుల ఆశ్రమ సేవాసంస్థ ద్వారా వృద్ధులకు బుధవారం అన్నదానం చేశారు. సర్పంచ్ జుజ్జువరపు ఎలీషా, సేవాసంస్థ నిర్వాహకులు లాం స్వర్ణకుమారి, కిరణ్ పాల్గొన్నారు.